'మిషన్ భగీరథ'లో ఖాళీలు

చేవెళ్ల, ఏప్రిల్ 19 : మిషన్ భగీరథ పథకంలో భాగంగా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేయుటకు చేవెళ్ల డివిజన్ పరిధిలో చేవెళ్ల, మొకిల, దామరిగిద్ద, అంతారం, శంకర్‌పల్లి, షాబాద్‌లో ఉద్యోగావకాశాలున్నాయని లియోస్ కంపెనీ ఎండీ సంపత్ పేర్కొన్నారు. మిషన్‌భగీరథ నీటి సరఫరా లైన్‌మెన్, ఎలక్ట్రికల్ లైన్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఐటీఐ చేసినవారు ఈ పోస్టులకు అర్హులన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 8639220618, 9908120765 ఫోన్‌నంబర్లను సంప్రదించాలన్నారు.



ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో అనూహ్య వాతావరణ పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఉదయం భానుడు భగభగమంటుంటే.. సాయంత్రం ఈదురుగాలులతో భారీ వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాల్లో పలు చోట్ల పంటలు దెబ్బతిన్నాయి. పిడుగులు పడి ఓ వ్యక్తి మృతి చెందగా, తాటి, కొబ్బరి చెట్లు పూర్తిగా కాలిపోయాయి. ఈదురుగాలులకు చెట్లు విరిగిపడి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

- ధర్మసాగర్‌లో ఏడెకరాల్లో బొప్పాయి పంటకు నష్టం
- వికారాబాద్‌లో దెబ్బతిన్న జొన్న పంట
- మేడ్చల్,మహేశ్వరంలో విరిగిన చెట్లు.. ట్రాఫిక్ జామ్
- మహేశ్వరంలో పిడుగుపడి వ్యక్తి మృతి
- ఇబ్రహీంపట్నం, ఆదిభట్లలో చెట్లు దగ్ధం
- ఆమనగల్లులో విద్యుత్ వైర్లు తెగి అంధకారం

ఉదయం సాయంత్రం

ఎండ... వాన!



కందుకూరు : తిమ్మాపూర్ గ్రామంలో ఇళ్ల మధ్య నిలిచిన వర్షపు నీరు

ఉమ్మడి జిల్లాలో విభిన్న వాతావరణ స్థితి

పలు చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షం

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి/వికారాబాద్/కులకచర్ల /మేడ్చల్ టౌన్/చేవెళ్ల/యాచారం/కందుకూరు/షాద్‌నగర్/చౌదరిగూడ /ఆదిభట్ల/ ఇబ్రహీంపట్నం/ఆమనగల్లు/మహేశ్వరం, ఏప్రిల్ 19: ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో విభిన్న వాతావరణ పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఒకవైపు కొన్ని ప్రాంతాల్లో ఎండలు మండుతుండుంటే మరో వైపు ఈదురుగాలులతో భారీ వర్షాలు కురుస్తున్నాయి. వికారాబాద్ మండలంలో ఈదురు గాలులతో భారీ వర్షాలు పడడంతో పంటలు నేలకొరిగాయి. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం రాచలూరులో 20మి.మీ వర్షాపాతం నమోదు కాగా కందుకూరులో 19.5మి.మీ, మంచాలలో 9మి.మీ వర్షం కురిసింది. కందుకూరు మండలంలోని పరిధిలోని తిమ్మాపూర్, మాదాపూర్, గుమ్మడవల్లి, ఆకులమైలారం, మీర్‌ఖాన్‌పేట్, కందుకూర్, మహమ్మద్‌నగర్, కొత్తగూడ, తదితర గ్రామాల్లో శుక్రవారం భారీవర్షం కురిసింది. అనేక చోట్ల పంట నష్టం జరిగింది. వ్యవసాయాధికారులు గ్రామాల్లో పర్యటించి పంటనష్టాన్ని పరిశీలించారు. అకాల వర్షాల కారణంగా రైతులు అప్రమత్తంగా ఉండాలని గ్రామస్తులకు సూచించారు. ఈదురుగాలులతో వర్షం పడుతున్న సమయంలో చెట్ల కింద ఉండకూడదన్నారు. మరోవైపు అనేక ప్రాంతాల్లో ఎండ తీవ్రత కొనసాగుతోంది. మేడ్చల్ జిల్లా కూకట్‌పల్లిలో 43 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే వికారాబాద్ జిల్లా కోట్‌పల్లిలో అత్యధికంగా 41.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, రంగారెడ్డిజిల్లా సరూర్‌నగర్ అల్కాపురి కాలనీలో అత్యధికంగా 42.6డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. వికారాబాద్ జిల్లా యాలాలలో 41.4 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

దెబ్బతిన్న పంటలు

చేవెళ్ల మండల పరిధిలోని ధర్మసాగర్ గ్రామానికి చెందిన గుర్రాల బల్వంత్‌రెడ్డి తనకున్న పది ఎకరాలకు గాను..7 ఎకరాల్లో ఈ యేడాది బొప్పాయి పంట సాగు చేశాడు. ఎకరాకు రూ.70 వేల వరకు పెట్టుబడి పెట్టాడు. గురువారం రాత్రి భారీగా ఈదురుగాలులు, వర్షం కురియడంతో బొప్పాయి పంట పూర్తిగా నేలకొరిగింది. కాయలన్నీ నేలరాలిపోయాయి. పంటను మార్కెట్‌కు తరలించే సమయంలో బొప్పాయి పంట దెబ్బతినడంతో రైతు బోరుమంటున్నాడు. ఏడు ఎకరాల్లో బొప్పాయి పంట దెబ్బతినడంతో రూ. 6నుంచి 7లక్షల వరకు నష్టం వాటిల్లిదని రైతు ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు. వికారాబాద్ మండలం పులుసు మామిడి గ్రామానికి చెందిన కేరెళ్లి అంజిరెడ్డి రెండు ఎకరాల్లో జొన్న పంట సాగు చేశారు. కురిసిన వానకు పూర్తిగా నెలకొరిగింది. గ్రామశివారులో ఓ ఇంటి వద్ద భారీ చెట్టు విరిగిపడింది. వ్యవసాయాధికారులు గ్రామంలో పర్యటించి పంట నష్టాన్ని పరిశీలించారు. అకాల వర్షాల కారణంగా రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కులకచర్ల మండలంలో శుక్రవారం మోస్తరు వర్షం కురిసింది. కులకచర్ల, ముజాహిద్‌పూర్, కామునిపల్లి తదితర గ్రామాల్లో వర్షం కురియడంతో కోతకొచ్చిన పంటలు, ధాన్యం విక్రయించే రైతుల్లోకలవరం మొదలైంది. ఈదురుగాలులకు యాచారం మండలం చౌదర్‌పల్లి, నల్లవెల్లి, తమ్మలోనిగూడ, యాచారం గ్రామాల్లో మామిడికాయలు, ధాన్యం రాలిపోయాయి.



వికారాబాద్ మండలం పులుసుమామిడిలో నేలకొరిగిన జొన్న చేను



మేడ్చల్‌లో కురుస్తున్న వర్షం



తులేకలాన్‌లో పిడుగుపడి కాలిపోతున్న తాటిచెట్టు

పిడుగు పడి వ్యక్తి, కొబ్బరి, తాటి చెట్లు దగ్ధం

మహేశ్వరం మండలం తుమ్మలూరు గ్రామానికి చెందిన మారమోని జంగయ్య (42) పొలం వద్ద నిలబడగా పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆదిభట్ల మున్సిపాలిటి పరిధిలోని కొంగరకలాన్ గ్రామంలో ఒకేసారి పొలంలో తాటిచెట్టుపై, వెంచర్‌లో కొబ్బరి చెట్టుపై పిడుగు పడగా పూర్తిగా దగ్ధమయ్యాయి. ఇబ్రహీంపట్నం మండలం తులేకలాన్ గ్రామ శివారులో పిడుగుపడి తాటిచెట్టు పూర్తిగా కాలిపోయింది. హైదరాబాదు- శ్రీశైలం ప్రధాన రహదారి తుమ్మలూరు పెద్దమ్మగుడి సమీపంలో భారీ చెట్టు కూలి రోడ్డుపై పడడంతో మూడు గంటల పాటు ట్రాఫిక్ జామ్ అయింది. పెట్రోలింగ్ పోలీసులు రోడ్డుపై పడిన చెట్టును పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. అలాగే ఆమనగల్లులో మూడు గంటల పాటు భారీ వర్షం కురియడంతో చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్ తీగలు తెగిపడడంతో సరఫరాలో అంతరాయం ఏర్పడింది. పట్టణంలో అంధకారం నెలకొంది.



తుమ్మలూరు పెద్దమ్మగుడి వద్ద కూలిన చెట్టు

విద్యుత్ సరఫరాలో అంతరాయం

మేడ్చల్ పట్టణంలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులతో దాదాపు గంట పాటు కురిసిన వర్షంతో జనజీవనం అతలాకుతలమైంది. కొన్ని ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ తీగల పై పడటంతో నాలుగు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపి వేశారు. వర్షం కారణంగా జాతీయ రహదారిపై రెండు గంటల పాటు వాహనాలు స్తంభించిపోయాయి. యాచారం మండలంలోని యాచారం, మాల్, మేడిపల్లి, తక్కళ్లపల్లి, తమ్మలోనిగూడ, గున్‌గల్,నానక్‌నగర్, మల్కీజ్ గూడ, చౌదర్‌పల్లి తదితర గ్రామాలలో శుక్రవారం ఈదురు గాలులతో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది, యాచారం, మాల్, నందివనపర్తి, గున్‌గల్ తదితర గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. షాద్‌నగర్ పట్టణంలో ఉరుములు మెరుపులతో కూడిన తేలిక పాటి వర్షం కురిసింది. జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని తుమ్మలపల్లి, లచ్చంపేట గ్రామాల్లో ఉదయం భారీ వర్షం కురిసింది.



చేవెళ్ల : ధర్మసాగర్ గ్రామంలో నేలరాలిన బొప్పాయి తోటను చూపిస్తున్న రైతు బల్వంత్‌రెడ్డి

కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిపై

భూ కబ్జా కేసు

- 200 గజాల ప్లాటు కబ్జా చేశారంటూ కోర్టును ఆశ్రయించిన బాధితురాలు
- కోర్టు ఆదేశాల మేరకు కేసు నమోదు.. కేసు దర్యాప్తులో ఉంది : ఆదిభట్ల సీఐ

ఆదిభట్ల, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) : భువనగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్ రెడ్డిపై రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. తన 200 గజాల ప్లాటు కబ్జా చేశారంటూ నల్గొండకు చెందిన కంచర్ల రాధిక అనే మహిళ ఇబ్రహీంపట్నం కోర్టును ఆశ్రయించింది. కోర్టు ఆదేశాల మేరకు భువనగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్‌రెడ్డి, చామర్తి మారుతి రవిశంకర్‌లపై 447, 427, 506, ఆర్/డబ్ల్యూ 34 ఐపీసీ సెక్షన్ ప్రకారం ఈనెల 13న ఎఫ్ఐఆర్ నెంబర్ 207/2024 కింద కేసు నమోదు చేశారు. చామల కిరణ్ కుమార్ రెడ్డి, మారుతి రవి శంకర్‌లు 2003లో అబ్దుల్లాపూర్‌మెట్ మండలం రాగన్నగూడ రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 500, 501లో 1200 గజాల స్థలం ఖరీదు చేసి చుట్టూ కాంపౌండ్‌వాల్, లోపల ఇంటి నిర్మాణం చేపట్టారని.. అందుకు సంబంధించి మున్సిపల్ పర్మిషన్లు, ప్రాపర్టీ ట్యాక్స్, కరెంట్ బిల్లులు, ప్లాటుకు సంబంధించిన లింక్ డాక్యుమెంట్స్ పోలీసులకు సమర్పించినట్లు పోలీసులు తెలిపారు. అయితే, కిరణ్ కుమార్ రెడ్డి 2003లో ప్లాటు కొనుగోలు చేశారు. రాధిక అదే సర్వేనెంబర్‌లో 2015లో 200 గజాల ప్లాటు కొనుగోలు చేసింది. ప్రస్తుతం ఆమెకు చెందిన 200 గజాల ప్లాటుతో పాటు వెంచర్‌లో చూపిన రోడ్డును సైతం కిరణకుమార్‌రెడ్డి, మారుతి రవిశంకర్‌లు కబ్జా చేసినట్లు ఫిర్యాదులో పేర్కొంది.



కేసు దర్యాప్తులో ఉంది.. ఎవరిపైనా నేరారోపణ లేదు : సీఐ

అబ్దుల్లాపూర్‌మెట్ మండలం రాగన్నగూడ రెవెన్యూ పరిధి సర్వేనెంబర్ 500, 501లో మారుతి నగర్ వెంచర్‌లో రెండు వందల గజాల ప్లాట్ కబ్జాకు గురైనట్లు రాధిక అనే మహిళ ఇబ్రహీంపట్నం మెట్రో పాలిటన్ కోర్టును ఆశ్రహించింది. ఈమేరకు 15వ మెట్రోపాలిటన్ కోర్టు ఆదేశాల మేరకు చామల కిరణ్ కుమార్‌రెడ్డి, రవిశంకర్‌లపై కేసు నమోదు చేశాం. కేసు దర్యాప్తులో ఉంది. కబ్జా అయినట్లు చెబుతున్న స్థలంలో ప్రహరీ నిర్మాణం చేపట్టారని, అందులో ఇంటి నిర్మాణం చేపట్టి కొందరు నివాసముంటున్నట్లు మా దృష్టికి వచ్చింది. అయితే, ఆ సర్వేనెంబర్‌లో డబుల్ రిజిస్ట్రేషన్లు ఉన్నట్లు సమాచారం. సబ్ రిజిస్ట్రార్, మున్సిపల్, రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకుని పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి వివరాలను కోర్టుకు సమర్పిస్తాం. ఇప్పటి వరకు ఎవరిపైనా నేరారోపణ చేయడం లేదు. ఉన్నతాధికారులు కూడా విచారణ చేపట్టారు. కాగా, చామల కిరణ్‌కుమార్ రెడ్డిపై లేనిపోని అసత్య ఆరోపణలు చేస్తున్నారని పీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూధన్ రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కిరణ్‌కుమార్ రెడ్డి 2003లో 1200 గజాల స్థలం చట్టప్రకారమే కొనుగోలు చేశారని అన్నారు. అసత్య ఆరోపణలు చేస్తే పరువు నష్టం దావా వేస్తామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

రెండోరోజు 8 నామినేషన్లు

ఆంధ్రజ్యోతి, మేడ్చల్/రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 19 : ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో చేవెళ్ల, మల్కాజ్‌గిరి పార్లమెంటు స్థానాలకు రెండో రోజు అభ్యర్థులు 8 నామినేషన్లు దాఖలు చేశారు. మేడ్చల్ జిల్లా మల్కాజిగిరి పార్లమెంటు స్థానానికి శుక్రవారం 5 నామినేషన్లు దాఖలైనట్లు జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు. స్వతంత్ర్య అభ్యర్థులుగా ఓరుగంటి వెంకటేశ్వర్లు, పెండ్యాల సాయి వరప్రసాద్, రాజేష్ మిశ్రా శివ్, చలిక చంద్రశేఖర్‌లు ఒక్కొక్క నామినేషన్ దాఖలు చేయగా, కుడుపూడి వీవీఎస్ నారాయణ రెండు సెట్లు నామినేషన్లు దాఖలు చేశారు. చేవెళ్ల పార్లమెంటు స్థానానికి మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. బీఎల్ఎఫ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో ఎంసీపీఐ(యు) పార్టీ అభ్యర్థి వనం సుధాకర్, ఇండియన్ నేషనల్ లీగ్ పార్టీ అభ్యర్థి మహ్మద్ చాంద్‌పాషా, భారతీయ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ తరఫున ప్రతిపాదకులు మేకల బిక్షపతి నామినేషన్ వేశారు. నామినేషన్ పత్రాలను జిల్లా రిటర్నింగ్ అధికారి శశాంకకు సమర్పించారు. కాగా కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మరో దఫాలో ఈనెల 22న రెండో సెట్ నామినేషన్ వేయనున్నారు. అలాగే ఈనెల 25న పెద్దఎత్తున పార్టీ శ్రేణులు, అభిమానులు ర్యాలీతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో రెండు సెట్ల నామినేషన్ వేసేందుకు కాసాని ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు పార్టీ వర్గాలు తెలిపారు.



నామినేషన్ వేస్తున్న అభ్యర్థి వనం సుధాకర్



మానవహారం

మహిళలు ఓటుహక్కుపై అవగాహన కలిగి ఉండాలని డీఆర్డీవో శ్రీలత సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎంపీడీవో సరితతో కలిసి మండల పరిధిలోని గ్రామాల మహిళా సంఘాల ప్రతినిధులతో ఏర్పాటుచేసిన ఒకరోజు అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. మానవహారం ఏర్పాటు చేశారు.

- కందుకూరు, ఏప్రిల్ 19

ఎన్నికల సంఘం

నిబంధనలు పాటించాలి

- ఎలక్షన్ వ్యయ పరిశీలకులు సెంథిల్ కుమారన్, రాజీవ్ చావ్రా

రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 19 : ఎన్నికల సంఘం నియమ నిబంధనల మేరకు పని చేయాలని చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకులు సెంథిల్ కుమారన్, రాజీవ్ చావ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఆర్వో కార్యాలయాన్ని సందర్శించారు. రాజేంద్రనగర్‌లోని నారం గెస్టహౌస్‌లో వ్యయ పరిశీలకులు సెంథిల్ కుమారన్, రాజీవ్ చావ్రా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక, అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్, ఇతర అధికారులతో కలిసి ఏఆర్వోలు, నోడల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వ్యయ పరిశీలకులు మాట్లాడుతూ అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచారంలో చేసే ఖర్చులను ఏ విధంగా లెక్కిస్తున్నారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల నిర్వహణలో అన్ని టీంలు సమన్వయంతో విధులు నిర్వహించాలని, అనుమానాస్పద బ్యాంకు ఖాతాలను చెక్ చేయాలని ఆదేశించారు. ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ, ఎస్ఎస్‌సీ అకౌంటింగ్ టీం సభ్యులు సమర్థవంతంగా బాధ్యతలను నిర్వహించాలని ఆదేశించారు. ప్రచారానికి పార్టీ ద్వారా అభ్యర్థి తరఫున ఖర్చుచేసే ప్రతీ పైసాను పకడ్బందీగా ఎన్నికల వ్యయం కింద జమ చూపెట్టాలని ఆదేశించారు. ఓటర్లను ప్రలోభాలు పెట్టినా, ఓటరును భయభ్రాంతులకు గురి చేసిన లేదా బలవంతంగా ప్రభావితం చేసినా సీ-విజిల్ యాప్ ద్వారా ఎవరైనా సరే సమాచారం ఇవ్వవచ్చని తెలిపారు. ఫిర్యాదు అందిన 100 నిమిషాల్లో సమస్యను పరిష్కరించడం జరుగుతుందన్నారు. సమస్యను ఎప్పటికప్పుడు కెమెరా ఆన్ చేసుకొని ఫొటో లేదా వీడియో తీసి సంక్షిప్తంగా టైప్‌చేసి పంపించాల్సి ఉంటుందని తెలిపారు. శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ స్నేహా, ఏఆర్‌లు వెంకట్ రెడ్డి, సూరజ్ కుమార్, సాయిరామ్, నోడల్ అధికారులు, ఎంసీసీ, అకౌంటింగ్ టీం, పోలీసు టీమ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సెంథిల్ కుమారన్, రాజీవ్ చావ్రా

మీడియా సెంటర్‌ను పరిశీలించిన సెంథిల్ కుమారన్

చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకులు సెంథిల్ కుమారన్ (ఇండియన్ రెవెన్యూ సర్వీసెస్ 2004 బ్యాచ్) కలెక్టరేట్‌లోని మీడియా సెంటర్‌ను శుక్రవారం పరిశీలించారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఎంసీఎంసీ ద్వారా చేపడుతున్న పనుల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఎంసీఎంసీ కేంద్రంలోని రికార్డులను ఆయన పరిశీలించారు.

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

మోమిన్‌పేట్, ఏప్రిల్ 19: మండలంలోని గోవిందాపూర్ పంచాయతీ కార్యదర్శి ఫేరోజ్‌ఖాన్‌ను సస్పెండ్ చేసినట్లు అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. గ్రామ పంచాయతీలో ఫేరోజ్‌ఖాన్ సక్రమంగా విధులు నిర్వహించడం లేదని ఫిర్యాదులు అందడంతో అధికారులు విచారణ జరిపారు. దీంతో అధికారుల విచారణ అనంతరం నివేదికను కలెక్టర్ సి.నారాయణరెడ్డికి అందించడంతో పంచాయతీ కార్యదర్శి ఫేరోజ్‌ఖాన్‌ను సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గత 15 రోజుల నుంచి గ్రామపంచాయతీ విధులకు హాజరు కాకపోవడం, మార్చి 27న మెమోకు ఎలాంటి సంజాయిషీ ఇవ్వకపోవడం, ఈనెల 3న ముఖ్య కార్య నిర్వాహణ అధికారి సమీక్షా సమావేశానికి హాజరు కాకపోవడం, ఈ నెల 4న ఎంపీడీవో గ్రామానికి వెళ్లిన సమయంలో లేకపోవడం, ఫోన్ స్విచ్ఆఫ్ వంటివి చేస్తున్నట్లు గ్రామస్థులు ఆరోపించారు. దీంతో గ్రామస్థులు గురువారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీవో యాదగిరి తెలిపారు.


ఫేరోజ్‌ఖాన్

గిరిజన గురుకుల పాఠశాల తనిఖీ

కొడంగల్ రూరల్, ఏప్రిల్ 19: కొడంగల్ మున్సిపల్ పరిధిలోని పాత కొడంగల్‌లో గల గిరిజన గురుకుల పాఠశాలను వికారాబాద్ అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ శుక్రవారం తనిఖీ చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రిన్సిపాల్ బలరాంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలకు పోలింగ్ బూత్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.


అధికారులతో మాట్లాడుతున్న జిల్లా అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

హరితహారం మొక్కలు అగ్నికి ఆహుతి

దోమ, ఏప్రిల్ 19: ప్రభుత్వం హరితహారం పథకంలో భాగంగా ప్రతీ గ్రామపంచాయతీకి లక్షలాది రూపాయలు ఖర్చుచేసి రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. మండలంలోని ఊటువల్లి నుంచి పరిగికి వెళ్లే మార్గంలో రోడ్డుకిరువైపులా మొక్కలు నాటారు. వాటి చుట్టూ చదును చేయించి మొక్కలు ఎప్పటికప్పుడు నీటిని అందిస్తూ పెరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సివుంది. అయితే రోడ్డుపక్కనే ఉన్న పంట పొలాలను చదును చేసుకునే రైతులు పిచ్చిమొక్కలతో పాటు హరితహారం మొక్కలకు నిప్పుపెట్టేస్తున్నారు. ప్రతీ ఏడాది ఇదే తంతు కొనసాగుతోంది. సంబంధిత అధికారులు రైతులకు అవగాహన కల్పించకపోవడం, వాటి నిర్వహణ పట్టించుకోవడంతో లక్షలాది రూపాయలు ఖర్చుచేసి నాటిన మొక్కలు వృథా అవుతున్నాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.


ఊటువల్లి నుంచి పరిగికి వెళ్లే మార్గంలో దగ్ధమైన హరితహారం మొక్కలు

గుర్తింపు లేని విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

వికారాబాద్, ఏప్రిల్ 19: నకిలీ, లూజ్ గుర్తింపు పొందని విత్తనాలను ఎట్టి పరిస్థితుల్లో రైతులకు అమ్మరాదని జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు తప్పని సరిగా అధీకృత డీలర్ వద్ద మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలని, కొన్న తర్వాత రసీదు పొందాలని సూచించారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు నకిలీ విత్తనాలను విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే సమాచారాన్ని దగ్గరలోని వ్యవసాయాధికారికి ఫిర్యాదు చేయాలని కోరారు.

బీసీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా రాజు

దోమ, ఏప్రిల్ 19: అయినాపూర్ గ్రామానికి చెందిన ఎస్.రాజు వికారాబాద్ జిల్లా బీసీ సంఘం ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. శుక్రవారం హైదరాబాద్‌లో రాజ్యసభ సభ్యుడు, బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య చేతుల మీదుగా ఆయన నియామక పత్రం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంఘం నాయకులు లాల్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


కృష్ణయ్య చేతుల మీదుగా నియామక పత్రం అందుకుంటున్న రాజు

కాంగ్రెస్‌తోనే పేదలకు సంక్షేమ ఫలాలు

● ఎన్నికల్లో బీజేపీకి ఓటుతో బుద్ధి చెప్పాలి ● ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

బషీరాబాద్, ఏప్రిల్ 19: కాంగ్రెస్‌తోనే పేదలకు సంక్షేమ పథకాలు అందుతాయని చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పిలుపునిచ్చారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం బషీరాబాద్ మండలంలోని మైల్వార్, ఎక్మాయి, దామర్‌చెడ్, బషీరాబాద్, నవాల్గ, గొట్టిగఖుర్దు, కాశీంపూర్, మంతట్టి గ్రామాల్లో స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లు నిర్వహించారు .అంతకు ముందు నీళ్లపల్లి ఏకాంబర దేవస్థానంలో ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యేతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్యే మాట్లాడుతూ మత రాజకీయాలను ప్రేరేపించే బీజేపీని మరోసారి నమ్మి ఓటు వేసి మోసపోవద్దన్నారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డిది దొరల కుటుంబామని, గతంలో గెలిచి ఏంచేశారో ప్రజలు గుర్తించాలన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీగా రంజిత్‌రెడ్డిని గెలిపిస్తే జోడేడ్లలాగా ప్రజలకు సేవలందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కరుణ అజయ్‌ప్రసాద్, జడ్పీటీసీ మిర్యాణం శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి జి.మాధవరెడ్డి, ఆపార్టీ మండలాధ్యక్షులు కలాల్ నర్సింహులుగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మణ్‌రావు, మాజీ జడ్పీటీసీ ఎం.రాకేష్, సీనియర్ నాయకులు డాక్టర్. సంపత్‌కుమార్, ఎస్.వెంకటేష్, బుయ్యని సత్యనారాయణ్‌రెడ్డి, సోంపల్లి బిచ్చి రెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ శంకర్‌రెడ్డి, రాముదాయక్, శంకరప్ప పాల్గొన్నారు.

రంజిత్‌రెడ్డికి మరో అవకాశమివ్వండి

శంకర్‌పల్లి: చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డికి ఎంపీగా మరోసారి అవకాశం ఇవ్వాలని టీటీడీ బోర్డు సభ్యురాలు, ఆయన సతీమణి సీతారెడ్డి కోరారు. శుక్రవారం శంకర్‌పల్లి మున్సిపల్ కేంద్రంలో కాంగ్రెస్ చేవెళ్ల ఇన్‌చార్జి పామెన భీంభరత్, మహిళా కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షురాలు జ్యోతిభీంభరత్‌తో కలిసి సీతారెడ్డి కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ బోర్డు సభ్యుడు సత్యనారాయణరెడ్డి, టీపీసీసీ కార్యదర్శి ఉదయ్‌మోహన్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, జడ్పీటీసీ గోవిందమ ఉన్నారు.

చేవెళ్ల: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు బండారు ఆగిరెడ్డి అన్నారు. శుక్రవారం చేవెళ్ల మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, ఎంపీ రంజిత్‌రెడ్డికి మద్దతుగా కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల ఎంపీగా రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



చేవెళ్ల: మాట్లాడుతున్న సీతారెడ్డి

వికారాబాద్: రంజిత్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన సతీమణి సీతా రంజిత్‌రెడ్డి, చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీమ్‌భరత్ అన్నారు. మోమిన్‌పేట్ మండల కేంద్రంలో శుక్రవారం నూతనంగా ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు సభ్యులు సత్యనారాయణరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన హరిహర గౌడ్

తాండూరు: తాండూరు సీనియర్ నాయకులు హరిహరగౌడ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. గతంలో బీఆర్ఎస్‌లో పని చేసిన ఆయన శుక్రవారం ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ రవిగౌడ్, తదితరులు ఉన్నారు.

నేడు తాండూరులో ప్రచారం

తాండూరు రూరల్: మండలంలోని వివిధ గ్రామాల్లో నేడు(శనివారం) కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి ఎంపీ రంజిత్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిలు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని మండల కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9గంటల నుంచి నారాయణపూర్, వీర్‌శెట్టిపల్లి, గోనూరు, చెనిగేష్‌పూర్, మధ్యాహ్నం 12గంటల నుంచి ఎల్మకన్నె, ఓగీపూర్, చంద్రవంచ, చిట్టిఘనాపూర్, సాయంత్రం 4.30గంటల నుంచి బెల్కటూర్, పర్వతాపూర్, చింతామణిపట్నం, రాత్రి 7గంటల నుంచి చెంగోల్, గౌతాపూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఎన్నికలు సజావుగా జరిగేట్లు చర్యలు

● ఏఆర్వో అనంతరెడ్డి



సమావేశంలో పాల్గొన్న ఏఆర్వో, ఎన్నికల వ్యయ పరిశీలకులు, తదితరులు

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 19 : లోక్‌సభ పోటీలో ఉన్న అభ్యర్థులు ఎన్నికల నియమావళిని ఖచ్చితంగా పాటించాలని ఎప్పటికప్పుడు ఖర్చుల వివరాలను అందించాలని అన్నారు. లోక్‌సభ ఎన్నికలు సజావుగా జరిగేట్లు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ సహాయ ఎన్నికల అధికారి, ఇబ్రహీంపట్నం ఆర్డీవో కె.అనంతరెడ్డి, ఎన్నికల వ్యయ అబ్జర్వర్ కుమార్ రాకేష్ రంజన్ సంబంధిత అధికారులకు సూచించారు. శుక్రవారం సాయంత్రం ఇబ్రహీంపట్నం ఆర్డీవో కార్యాలయంలో మోడల్ కోడ్ నిర్వహణపై ఫ్లైయింగ్ స్క్వాడ్, ఎస్ఎస్‌టీంలు, సహాయ వ్యయ అధికారులు, వీడియో సర్వలెన్స్ టీంలు, పోలీస్ అధికారులతో జరిగిన సమావేశంలో వారు ఈ సూచనలు చేశారు. ఇబ్రహీంపట్నం ఏసీపీ కేవీకే రాజు తదితరులు పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కేశంపేట, ఏప్రిల్ 19 : మానసిక దివ్యాంగుల పట్ల వారి తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని కేశంపేట ఏపీఎం భగవంతు సూచించారు. మండల కేంద్రంలోని మానసిక దివ్యాంగుల కేంద్రంలో శుక్రవారం బుద్ధిమాందిత పిల్లల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పునరావాస కేంద్రానికి వస్తున్న పిల్లలకు ఉచితంగా బస్‌పాస్ ఇప్పించడం జరిగిందని వివరించారు. స్పీచ్ థెరపిస్ట్ సురక్షిత, స్పెషల్ ఎడ్యుకేటర్ కవిత, సీసీలు

భువనగిరికి తరలిన సీపీఎం శ్రేణులు



ర్యాలీ చేస్తున్న సీపీఎం కార్యకర్తలు

యాచారం, ఏప్రిల్ 19 : సీపీఎం భువనగిరి ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్ నామినేషన్ ర్యాలీకి శుక్రవారం యాచారం మండలంలోని వివిధ గ్రామాల నుంచి భారీగా సీపీఎం శ్రేణులు భువనగిరికి తరలి వెళ్లాయి. అంతకు ముందు మండల కేంద్రంలో ఆ పార్టీ కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఆ పార్టీ మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహా మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ప్రజలు విసుగు చెందారన్నారు.

కల్యాణం.. కమనీయం

●వైభవంగా రుక్మిణీ మాధవుల పరిణయం

● ధనరాశి పర్వతానికి తరలివచ్చిన భక్తజనం

కడ్తాల్, ఏప్రిల్ 19 : జిల్లాలో ప్రసిద్ధి గాంచిన కడ్తాల మండలం బాలాజీనగర్ తండా సమీపంలోని ధనరాశి పర్వతంపై గల శ్రీ రాధాకృష్ణ ఆలయంలో శుక్రవారం శ్రీ రుక్మిణీ మాధవుల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణానికి మండలంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి, హైదరాబాద్ నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ అహోబిల జీయర్ స్వామి, ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. నేపాల్‌లోని జనక్ పూర్‌కు చెందిన బాబా భగవాన్ మహారాజ్, రామేశ్వర్ దాస్ మహారాజ్, ప్రముఖ కవి ఆచార్య మన్న చెన్నప్ప, భగవద్గీత ప్రచారకులు శ్రీనివాస్, వికాస తరంగిణి అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, జాతీయ బంజారా మిషన్ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణనాయక్, గురుస్వామి రాజారాములు పాల్గొన్నారు. అహోబిల జీయర్‌స్వామి భక్తులనుద్దేశించి ఉపదేశమిచ్చారు.



కడ్తాల్ : కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

షాద్‌నగర్ అర్బన్ : షాద్‌నగర్ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ఆధ్వర్యంలో వేద పండితులు స్వామివారి కల్యాణం జరిపించారు. ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, ఎదుర్కోళ్ల అనంతరం కల్యాణం జరిపించారు. అంతకుముందు ఆలయంలో ధ్వజారోహణం, బలిహారణం, హోమం నిర్వహించారు. సంతానం కోసం భార్యభర్తలు గరుడ ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు తీర్థప్రసాదాలు ఇచ్చి, అన్నదాన కార్యక్రమం చేపట్టారు.



షాద్‌నగర్ అర్బన్ : ఉత్సవ విగ్రహాల ఊరేగింపులో నర్సింహులు, తదితరులు

కోదండ రామస్వామి..

యాచారం : మండల పరిధి నందివనపర్తిలోని శ్రీ ఓంకారేశ్వర స్వామి ఆలయంలో శ్రీ కోదండ రామస్వామి వారి కల్యాణాన్ని శుక్రవారం పూజారి శివ ఆధ్వర్యంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు వైభవంగా, భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అంతకుముందు గణపతికి ప్రత్యేక పూజలు చేశారు.

రేగడి ఘనాపూర్‌లో విగ్రహాల ప్రతిష్ఠాపన

చేవెళ్ల: మండల పరిధిలోని రేగడిఘనాపూర్ గ్రామంలో జరుగుతున్న శ్రీ పోచమ్మదేవి, నాగ గ్రామ నాభి శిల సహిత ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఇన్‌చార్జి పామెన భీంభరత్, సత్యనారాయణరెడ్డిలతోపాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మాజీ సర్పంచ్‌లు వెంకట్‌రెడ్డి, రాంరెడ్డి, నర్సింహులు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ రాములు, జర్నలిస్టు సంఘం జిల్లా హౌసింగ్ సొసైటీ ఉపాధ్యక్షుడు రాజేశ్, పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

ఆమనగల్లు , ఏప్రిల్ 19 : హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ అన్నారు. పట్టణంలోని శ్రీ లక్ష్మీ గార్డెన్‌లో శుక్రవారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోనుగోటి అర్జున్‌రావు, మున్సిపల్ అధ్యక్షుడు నేనావత్‌పత్యానాయక్ అధ్యక్షతన లోక్‌సభ ఎన్నికలు, కేటీఆర్ పర్యటన ఏర్పాట్లపై సన్నాహక సమావేశం నిర్వహించారు. పట్టణంలోని లక్ష్మీ గార్డెన్‌లో శనివారం బీఆర్ఎస్ కల్వకుర్తి నియోజకవర్గ స్థాయి కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు జైపాల్ యాదవ్ తెలిపారు. సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, కేటీఆర్, మాజీమంత్రి నిరంజన్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్ హాజరవుతున్నట్లు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం, జడ్పీటీసీలు జర్పుల దశరథ్ నాయక్, అనురాధపత్యానాయక్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జైపాల్ యాదవ్

బీజేపీ, కాంగ్రెస్ కుట్రలను తిప్పికొట్టాలి

తెలంగాణ రాష్ట్రాన్ని అస్థిర పరిచేందుకు బీజేపీ, కాంగ్రెస్ చేస్తున్న కుట్రలను ప్రజలంతా సమర్థవంతంగా తిప్పికొట్టాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆమనగల్లు, కడ్తాల్, వెల్దండ, మండలాల్లో శుక్రవారం ఆయన పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు.

ధరణి లోపాలు సరిదిద్దేందుకు చర్యలు



సమస్యలు తెలుసుకుంటున్న లీప్స్ ప్రతినిధులు

యాచారం, ఏప్రిల్ 19 : ధరణి పోర్టల్‌లో ఉన్న లోపాలను సరిచేసి, రైతుల సమస్యలను పరిష్కరించి ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామని లీగల్ ఎంపవర్‌మెంట్ అండ్ అసిస్టెన్స్ ఫర్ ఫార్మర్స్ సొసైటీ(లీప్స్) సంస్థ అధ్యక్షుడు సునిల్, ఉపాధ్యక్షుడు జీవన్‌రెడ్డి చెప్పారు. శుక్రవారం యాచారం మండల కేంద్రంలో భూసమస్యలతో ఇబ్బందులు పడుతున్న రైతుల సమస్యలను వారు తెలుసుకున్నారు. రైతుల నుంచి ఫిర్యాదులను తీసుకున్నారు. తమకందిన ఫిర్యాదులను తహసీల్దార్, ఆర్డీవోకు అందించి వాటిని పరిష్కరిస్తామన్నారు.

అకారణంగా బయటకు రావొద్దు

●డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయలక్ష్మి

షాద్‌నగర్, ఏప్రిల్ 19 : ప్రజలు అకారణంగా ఇళ్ల నుంచి బయటకు రావొద్దని షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఉష్ణోగ్రతలు 44 డిగ్రీల వరకు నమోదు అవుతున్నాయని చెప్పారు. దీని వల్ల ప్రజలు వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందన్నారు. వచ్చేనెలలో ఎండ తీవ్రత మరింత పెరుగునుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

బీజేవైఎం నియోజకవర్గ కన్వీనర్‌గా అనిల్

తలకొండపల్లి, ఏప్రిల్ 19 : బీజేవైఎం కల్వకుర్తి నియోజకవర్గ కన్వీనర్‌గా తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన పద్మ అనిల్ రెండోసారి నియమితులయ్యారు. శుక్రవారం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు యాదిష్ నుంచి అనిల్‌కు నియామక ఉత్తర్వులు అందాయి. తన నియామకానికి సహకరించిన ఎన్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, జిల్లా అధ్యక్షుడు యాదిష్, నియోజకవర్గ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

శంకర్‌పల్లి, ఏప్రిల్ 19 : బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ శంకర్‌పల్లి మండల అధ్యక్షుడు రాములు గౌడ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని జన్వాడ గ్రామానికి చెందిన బీర్ల శ్రీనివాస్‌ను మండల అధికార ప్రతినిధిగా నియమిస్తూ నియామక పత్రం అందించారు. తనను నియమించిన పార్టీ పెద్దలకు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఎంపీపీ. బీర్ల నర్సింహ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పరమేశ్వర్‌రెడ్డి, కుమార్, హరీష్, ప్రభాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పాఠశాల అభివృద్ధికి విరాళం

యాచారం, ఏప్రిల్ 19 : ప్రభుత్వ పాఠశాల గదులకు మరమ్మతులు చేసి, వసతులు కల్పిస్తామని భారత్ సేవాసహకార ఫోరం ప్రతినిధి నాగేశ్వర్‌రావు తెలిపారు. శుక్రవారం ఆయన గున్‌గల్ ఉన్నత పాఠశాలను సందర్శించి అక్కడి సమస్యలను తెలుసుకున్నారు. పాఠశాలలో పలు అభివృద్ధి పనుల కోసం రూ.2.25లక్షల చెక్కును ప్రధానోపాధ్యాయుడు పాండురంగారెడ్డికి అందించామని చెప్పారు. పాఠశాలలను బాగు చేయడంకోసం ముందుకు వచ్చిన తమ ఫోరం చైర్మన్ బసవరాజు శ్రీనివాస్ చేసిన మేలు మరువలేనిదన్నారు. కార్యక్రమంలో పీఈటీ సాబేర్, తదితరులున్నారు.

ట్రాఫిక్ పోలీసుల సేవలు ప్రశంసనీయం

శంషాబాద్, ఏప్రిల్ 19 : మండుతున్న ఎండలను లెక్కచేయకుండా ప్రజలకు సేవ చేస్తున్న ట్రాఫిక్ పోలీసుల సేవలు ప్రశంసనీయమని మాదాపూర్ ఎల్ఎల్‌టీ కంపెనీ ప్రతినిధులు అన్నారు. ఆర్జీఐఏ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందికి శుక్రవారం చల్లని నీరు, మజ్జిగ అందజేశారు. వారి ఆరోగ్యం దెబ్బతినకుండా ఉండేందుకు తాము ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.


పాఠశాలకు సౌకర్యాల కల్పనకు కృషి

షాద్‌నగర్‌రూరల్, ఏప్రిల్ 19 : ఫరూఖ్‌నగర్ మండలం రాయికల్ పాఠశాలలో విద్యార్థులకు సౌకర్యాల కల్పనకు కృషి చేస్తామని ఐ నడక్ సంస్థ సెక్రెటరీ సూచి అగర్వాల్ తెలిపారు. పాఠశాలలో రూ.40 లక్షలతో చేపట్టబోయే పనుల స్థలాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఆధునిక సౌకర్యాలతో టాయిలెట్స్, మీటింగ్‌హాల్, ప్రధానోపాధ్యాయుడి గది నిర్మిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు కూడా సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని అన్నారు. కార్యక్రమంలో కంపెనీ లీగల్ హెడ్ రేణుక, ప్రాజెక్ట్ మేనేజర్ ఇబ్రహీం, హెచ్ఎంలు జయమ్మ, కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

ఆరెస్పీకి ఆత్మీయ విరాళం

ఆమనగల్లు , ఏప్రిల్ 19 : బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్ నామినేషన్ ఫీజుకు ఆరెస్పీ సపోర్టర్స్ ఆత్మీయ విరాళం అందజేసి అభిమానం చాటుకున్నారు. ఆయన నామినేషన్ ఫీజు కోసం ఆరెస్పీ సపోర్టర్స్ నాయకుడు గోవిందు శ్రీధర్ ఆధ్వర్యంలో ఒక్క రూపాయి ఆత్మీయ విరాళం క్రౌడ్ ఫండింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వచ్చిన రూ.17,500ను శుక్రవారం ఆర్ఎస్‌ప్రవీణ్‌కుమార్‌కు అందజేశారు.

మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యం



చేవెళ్ల: కౌకుంట్లలో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తరపున ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

చేవెళ్ల, ఏప్రిల్ 19 : నరేంద్రమోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమని, లోక్‌సభ ఎన్నికల్లో కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని బీజేపీ చేవెళ్ల మండల ప్రధాన కార్యదర్శి ఏ. అనంత్‌రెడ్డి కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం చేవెళ్ల మండల పరిధిలోని కౌకుంట్ల గ్రామంలో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ నాయకత్వంలోనే దేశం మరింత ముందుకు సాగుతుందన్నారు. బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మచ్చలేని నాయకుడని చెప్పారు. పార్టీలు మారుతూ అవినీతికి పాల్పడే నాయకులను ఓడించాలన్నారు. విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గ్రామ బూత్ కమిటీ అధ్యక్షుడు కొండా నాందేవ్‌గౌడ్, నాయకులు నాగర్జున్‌రెడ్డి, వైభవ్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, జయసింహరెడ్డి, కుమార్‌గౌడ్, సారా కరణ్‌జీ, మాదవరావ్, సారా శివకుమార్‌జీ, బూషికేష్‌గౌడ్, దండు నర్సింలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

దేశం కోసం, ధర్మం కోసం బీజేపీ గెలవాలి

సరూర్‌నగర్, (ఆంధ్రజ్యోతి): దేశం కోసం, ధర్మం కోసం బీజేపీ గెలవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి అందెల శ్రీరాములుయాదవ్ అన్నారు. చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తమ పార్టీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని ఓటర్లు ఆదరించి ఎంపీగా గెలిపించాలని ఆయన కోరారు. కొండాకు మద్దతుగా శుక్రవారం మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేట్ కార్పొరేషన్ పరిధిలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మీర్‌పేట్ శాఖ అధ్యక్షుడు పెండ్యాల నర్సింహ, కౌన్సిల్ బీజేపీ ఫ్లోర్ లీడర్ కీసరి గోవర్ధన్‌రెడ్డి, కార్పొరేటర్లు మద్ది సబితారాజశేఖర్‌రెడ్డి, కీసరి హరినాథ్‌రెడ్డి, పసునూరి భిక్షపతిచారి, పార్టీ ప్రధాన కార్యదర్శులు గాజుల మధు, కె.సోమేశ్వర్, నాయకులు సూల ప్రభాకర్, యాదగిరియాదవ్, నాగరాజు, బుచ్చిరాములు, నగేశ్, జేడీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి

దోమ: బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించాలని సోదరి డాక్టర్ మీరా శుక్రవారం బొంపల్లి గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మరోసారి నరేంద్రమోదీ ప్రధాని కావాలంటే ప్రజలు బీజేపీకి ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పొరల అనంతయ్య, జిల్లా నాయకులు యాదయ్య, బొంపల్లి బూత్ అధ్యక్షుడు నర్సింహ, ఆంజనేయులు, రవీందర్, మల్లేశ్, హన్మంతు, మల్లయ్య, నర్సింహులు, మహేందర్, వేణు తదితరులు పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా బీజేపీ నాయకులు శుక్రవారం ప్రచారం నిర్వహించారు. మండలంలోని రామ్‌నాథ్ గూడుపల్లి, దుర్గం చెరువు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు కమలం పువ్వు గుర్తుపై ఓటేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మహిపాల్, బీజేవైఎం నాయకులు రాఘునాథ్‌రెడ్డి, నర్సింహారెడ్డి, వెంకట్‌రెడ్డి, రాజిరెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, వెంకట్, నగేశ్ పాల్గొన్నారు.

విశ్వేశ్వర్‌రెడ్డి కుటుంబ సభ్యుల ప్రచారం

కులకచర్ల: బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా ఆయన కుటుంబసభ్యులు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. మండలంలోని అనంతసాగర్‌లో శుక్రవారం ఆయన కుటుంబ సభ్యులు డాక్టర్ కల్పనారెడ్డి, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సౌమ్య వెంకట్రామ్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు మహిపాల్ తదితరులు ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దళితమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శులు హనుమంతు, పాశం నర్సింహారెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు భీమయ్య, మండల కోశాధికారిగా మహిపాల్, ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



దోమ:బొంపల్లిలో ఓటర్లతో మాట్లాడుతున్న డాక్టర్ మీరా

క్రైం కార్నర్

అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు సీజ్

మాడ్గుల, ఏప్రిల్ 19 : మండలంలోని కలకొండ వాగు నుంచి అక్రమంగా ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తుండగా పక్కా సమాచారంతో శుక్రవారం పోలీసులు వాటిని స్వాధీనం చేసుకొని మాడ్గుల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన వెల్దండా మండలం బైరాపురం గ్రామానికి చెందిన కుడుముల వెంకటేష్, కొండపురి సురేష్ అనే ట్రాక్టర్ డ్రైవర్లను అదుపులోకి తీసున్నట్లు సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. ఎలాంటి అనుమతి లేకుండా వాగులో నుంచి ఇసుక తరలిస్తున ట్రాక్టర్ డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు సీఐ విష్ణువర్ధన్ రెడ్డి చెప్పారు.

న్యూడ్ కాల్‌కు మోసపోయిన వ్యక్తి

కందుకూరు, ఏప్రిల్ 19 : గుర్తు తెలియని ఓ యువతి చేసిన న్యూడ్ కాల్‌కు మోసపోయిన ఓ వ్యక్తి ఆ కిలేడీ ఉచ్చులో పడి తన పరువు పోతుందని రూ.ముప్పై వేలు సమర్పించుకున్న సంఘటన కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఆ కిలేడి మరిన్ని డబ్బులు డిమాండ్ చేయడంతో శుక్రవారం బాధితుడు కందుకూరు పోలీసులను ఆశ్రయించాడు. సీఐ మక్బూల్‌జానీ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలో నివాసముంటున్న ఆవుల జయరాజ్‌కు ఈనెల 17న ఓ యువతి నుంచి న్యూడ్‌కాల్ వచ్చింది. దీనికి అతను స్పందించి మాట్లాడడంతో ఆ కిలేడి కాల్‌ను రికార్డు చేసి, తనకు డబ్బులు కావాలంటే అతన్ని వేదించింది. ఈనెల 18న ఫోన్ ద్వారా ఆన్‌లైన్‌లో రూ.ముప్పై వేల నగదును ఆమెకు పంపించినా వేదింపులకు గురిచేసింది. దీంతో శుక్రవారం బాధితుడు కందుకూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బ్యాటరీ పరిశ్రమలో అగ్నిప్రమాదం

● తృటిలో తప్పిన ముప్పు

నందిగామ, ఏప్రిల్ 19 : నందిగామ గ్రామ శివారులో గల హెరిటర్ బ్యాటరీ పరిశ్రమలో శుక్రవారం అగ్నిప్రమాదం జరిగింది. సమాచారం తెలుసుకున్న నందిగామ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ సంఘటన స్థలానికి చేరుకుని ఫైర్‌ఇంజన్ల సహాయంతో మంటలను అదుపులోకి తెచ్చారు. బ్యాటరీ పరిశ్రమలో బ్యాటరీలు చార్జింగ్ పెట్టడానికి ఉపయోగించే పవర్ కేబుల్స్‌లో షాట్‌సర్క్యూట్ రావడమే అగ్ని ప్రమాదానికి కారణం అయ్యిండొచ్చని పోలీసులు చెప్పారు. అగ్నిప్రమాదం వల్ల సుమారు రూ. కోటి ఆస్తినష్టం జరిగిందని పరిశ్రమ నిర్వాహకులు తెలిపారు. ప్రమాద సమయంలో కార్మికులు ఎవరూ విధుల్లో లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. పరిశ్రమ నిర్వాహకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యం

ఆదిభట్ల, ఏప్రిల్ 19 : పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో ఓ గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యమైన ఘటన ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. ఆదిభట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం తుర్క యాంజాల్ మున్సిపాలిటి శ్రీరామ్ నగర్ కాలనీలో సర్వే నెంబర్ 197లోని వ్యవసాయ భూమిలో కుళ్లిపోయిన స్థితిలో మహిళ మృతదేహం ఉన్నట్లు సమాచారం వచ్చింది. ఆ మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించినట్లు సీఐ తెలిపారు. అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. మృతురాలు 75 నుంచి 80 సంవత్సరాల వయస్సు కలిగి ఉంటుందని చెప్పారు. మృతదేహంపై లేత నారింజ రంగు చీర ఉందని, గుర్తింపునకు ఎలాంటి ఆధారాలు లేవని సీఐ తెలిపారు. మృతురాలి ఆచూకి తెలిసిన వారు 8712662364, 8712662382, 8712662671 ఫోన్ నెంబర్లకు సమాచారం ఇవ్వాలని సీఐ చెప్పారు.

లారీ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

మాడ్గుల, ఏప్రిల్ 19 : షాద్‌నగర్ నుంచి మాడ్గుల మీదుగా చెన్నై వెళుతున్న ఓ లారీ బ్రాహ్మణపల్లి సమీపాన మూల మలుపు వద్ద శుక్రవారం తెల్లవారు జామున బోల్తా పడినట్లు గ్రామస్థులు తెలిపారు. ప్రమాదంలో లారీ డ్రైవర్ వెంకటేష్‌కు తీవ్రగాయాలైనట్లు చెప్పారు. అతన్ని వైద్యం కోసం 108లో హైదరాబాద్‌కు తరలించినట్లు తెలిపారు. లారీ బోల్తాపడటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడగా పోలీసులు క్రేన్ సహాయంతో లారీని పక్కకు తీసారు. లారీ యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు.. ఒకరి మృతి

శంషాబాద్ రూరల్ ఏప్రిల్ 19 : ఓఆర్ఆర్‌పై ఆగి ఉన్న ఓ లారీని ఓ కారు ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయలయ్యాయి. ఈ సంఘటన శుక్రవారం శంషాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏపీలోని కర్నూల్‌కు చెందిన విజయ్‌కుమార్, మాలతి దంపతులు డ్రైవర్ నర్సింహారెడ్డి, కూతురు మౌలికతో కలిసి టీఎస్ 09 యూడీ 9541 నెంబరు గల కారును అద్దెకు తీసుకుని పెద్దఅంబర్‌పేట్‌కు వెళ్లి తిరిగి కూకట్‌పల్లికి వెళుతున్నారు. మార్గ మధ్యలో హమీదుల్లానగర్ వద్ద ఓఆర్ఆర్‌పై ఆగి ఉన్న లారీని వారి కారు బలంగా ఢీకొంది. కారులో ఉన్న విజయ్ కుమార్(52) అక్కడికక్కడే మృతి చెందగా అతని కూతురు, డ్రైవర్‌కు తీవ్ర గాయాలవ్వగా, భార్యకు స్వల్ప గాయలయ్యాయి. వాహనాదారుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించి, గాయపడ్డ వారిని శంషాబాద్‌లోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో కారు దగ్ధం

మొయినాబాద్ ఏప్రిల్ 19 : షార్ట్‌సర్క్యూట్‌తో ఓ కారు దగ్ధమయిన సంఘటన మండల పరిధిలోని అప్పారెడ్డిగూడ స్టేజీ సమీపంలో హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై జరిగింది. వివరాలిలా ఉన్నాయి. చేవెళ్ల మండలంలోని గుండాల గ్రామానికి చెందిన సుధాకర్ అనే వ్యక్తి తన వ్యాగనార్ కారును హైదరాబాద్‌లో సర్వీసింగ్ చేయించుకొని శుక్రవారం ఇంటికి వస్తుండగా మొయినాబాద్ మండలంలోని అప్పారెడ్డిగూడ పాత గేటు వద్ద గల గ్రీన్‌ఫీల్డ్ సమీపంలోకి రాగానే కారు లోంచి పొగలు వస్తుండడాన్ని గమనించి, కారు దిగి చూసే సరికి మంటలు చెలరేగాయి. చూస్తుండగానే కారు కాలిపోయింది.

వంశీచంద్ గెలుపు కోసం పనిచేయాలి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



కాంగ్రెస్‌లో చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానిస్తున్న వీర్లపల్లి

కేశంపేట/షాద్‌నగర్/ఆమనగల్లు, కొందుర్గు, ఏప్రిల్ 19 : కాంగ్రెస్ పార్టీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి గెలుపు కోసం పని చేయాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని దేవునిగుడి తండాకు చెందిన పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గూడ వీరేశ్ నేతృత్వంలో శుక్రవారం ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలన ప్రజా పాలన నిర్వహిస్తున్నదని అన్నారు. కార్యక్రమంలో కేశంపేట జడ్పీటీసీ తాండ్ర విశాలశ్రవణ్‌రెడ్డి, లక్ష్మణ్‌నాయక్, దశరథ్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి నామినేషన్ దాఖలుకు షాద్‌నగర్ నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నేతృత్వంలో భారీగా కార్యకర్తలు తరలివెళ్లారు. అలాగే ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాల నుంచి వాహనాల్లో మహబూబ్‌నగర్‌కు తరలారు ఆమనగల్లు బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, నాయకులు బీచ్యనాయక్, ప్రభాకర్ రెడ్డి , కిషన్‌రెడ్డి డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రమణారెడ్డి, జడ్పీటీసీ ప్రభాకర్ రెడ్డి, తదితరులు ఉన్నారు. అలాగే వంశీచంద్‌రెడ్డి గెలవాలని, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లికి మంత్రి పదవి రావాలని కోరుతూ పులుసుమామిడి మాజీ సర్పంచ్ షరీఫాబేగం జహంగీర్ నెల్లూరులోని రహమతాబాద్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.